క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ కొయ్యలగూడెం మండల విస్తృత స్థాయి సమావేశం బయ్యనగూడెం గ్రామంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న చింతల్ సెంటర్లో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా, నియోజకవర్గ నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

అధ్యాపకునికి డాక్టరేట్

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకుడు వి.మదన్ మోహన్‌కు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కామవరపుకోట ఎంపీడీఓగా సరళ కుమారి

కామవరపుకోట: స్థానిక ఎంపీడీఓగా ముళ్లగిరి సరళ కుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సారా స్వాధీనం, ముగ్గురి అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం మండలం జిల్లేళ్లగూడెం గ్రామ సమీపంలో ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన సంసాని సుబ్రహ్మణ్యం నుంచి 125 లీటర్ల సారా, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. బెల్లం అమ్మిన బొమ్మ లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు.

తిరుమలాపురంలో..

జంగారెడ్డిగూడెం: మండలంలోని తిరుమలాపురంలో 2 లీటర్లు సారా కలిగి ఉన్న మరీదు అంకలయ్యను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. సారా స్వాధీనం చేసుకని, రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



ఫ్రాన్సిస్‌ను పరామర్శించిన తలారి వెంకట్రావు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంకు చెందిన సీపీఎం జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ తల్లి ఇటీవల మృతి చెందారు. ఫ్రాన్సిస్‌ను మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించి, ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. తిరుగుడు మెట్ట సర్పంచ్, లాయర్ కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏలకు న్యాయం చేయాలి

లింగపాలెం: మండలంలో తొలగించిన వెలుగు వీవోఏలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. లింగపాలెంలో వీవోఏలు చేపట్టి రిలే దీక్షలు బుధవారం 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సబ్ కలెక్టర్‌కు వీవోఏల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వీవోఏ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి తదితరులు మాట్లాడారు.

కలెక్టర్‌ను కలిసిన నిర్వాసితులు

వేలేరుపాడు: తమ గ్రామాన్ని 41.15 కాంటూర్ పరిధిలో కలిపి, ముందుగా పునరావాసం కల్పించాలని తాట్కూర్ గొమ్ము కాలనీ నిర్వాసితులు కలెక్టర్‌ను కోరారు. బుధవారం వారు కలెక్టర్‌ను కలిశారు. గ్రామంలో 73 కుటుంబాలు ఉన్నాయని, వరదల వల్ల వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. తమకు న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని నిర్వాసితులు తెలిపారు. కార్యక్రమంలో స్పందన, అర్జా బిక్షంరావు, వలపర్ల చిట్టిబాబు, అనసూయ, కేదాసి విష్ణు, మానుపల్లి జయమ్మ, నంబూరి కనక, నిర్మల, సీత ఉన్నారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



బుట్టాయగూడెం : పందిరిమామిడిగూడెంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: విప్లవజ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతిని అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం అశ్వారావుపేట రోడ్డులో, స్థానిక ఏఎస్ఆర్ మున్సిపల్ పార్కు వద్ద ఉన్న అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను కొనియాడారు. ప్రధాన కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూరను విజయవంతంగా పూర్తిగా చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరర్ గొట్టుముక్కల భాస్కర్‌రాజు మాట్లాడతూ ఉగ్రవాద నిర్మూలనకు యూకేఎస్ఎస్ తరుపున మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో దండు ధనరాజు, జంపన సూరిబాబు, ఎస్ఆర్ ధర్మదేవ్, మంతెన సత్యనారాయణ, పేరిచర్ల సత్యనారాయణ రాజు, ఎస్‌వీపీకేఎం మురళీవర్మ, భూపతిదేవ్, ఇందుకూరి వెంకట సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

డీవైఎఫ్ఐ సుభాని అధ్యక్షతన, సంఘం జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి దేశభక్తిని దేశంలో ఉన్న యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూర్యకిరణ్ సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు ఎం జీవరత్నం, ఎ.ప్రభాకరరావు, పోతురాజు, బి.నాని, సునీల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఉద్యమించాలి

ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో ఇఫ్టూ, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మంచిలి రాజు, గంపల శ్రీను, తానిగడప వెంకటేశ్వరరావు, ఇ.భూషణం, బన్నె వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం : అల్లూరికి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు



జంగారెడ్డిగూడెం : అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అల్లూరి స్మారక మ్యూజియం ఏర్పాటు చేయాలి

కొయ్యలగూడెం: విప్లవ జ్యోతి, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు స్మారక మ్యూజియం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొయ్యలగూడెంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద అల్లూరి 101వ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారామరాజు చరిత్రను భావితరాలు తెలుసుకోవడానికి ఆయన నడయాడిన మన్యం ప్రాంతంలో మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. బ్రిటిషర్లను మూడేళ్ల పాటు ముప్పుతిప్పలు పెట్టి తెలుగు వాడి పౌరుషం అల్లూరి జగద్విఖ్యాతం చేశారని గుర్తుచేశారు. కన్నాపురంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకల అన్నవరం, సంకు కొండ, గంటా శ్రీను, నూకల రాము, మద్దు గోపి, మారిశెట్టి శ్రీను, గోలిశెట్టి ప్రసాద్, టి.వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి

చింతలపూడి : అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత పట్టణంలో సెంటర్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు తదితరులు అల్లూరికి నివాళులర్పించారు. దేశ విముక్తి కోసం స్వాతంత్ర్య పోరాటం చేసిన ఎందరో నాయకుల్లో అల్లూరి సీతారామరాజు అగ్రగణ్యుడని కొనియాడారు.

గిరిజన గ్రామాల్లో..

బుట్టాయగూడెం: అల్లూరి వర్ధంతిని మండలంలోని పందిరిమామిడిగూడెం, లంకపాకల, నూతిరామన్నపాలెం గ్రామాల్లో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, పివైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కారం రాఘవ, సర్పంచ్ కారం లక్ష్మీలు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజన ప్రాంతం నుంచి బ్రిటిష్ వారిపై చేసిన పోరాటాలను వివరించారు. గిరిజన చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. నాయకులు, తగరం బాబురావు, వెట్టి భారతి, కరకల నడిపిరాజు పిడిఎస్‌యు నాయకులు బి. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జీవసమాధి ఆరాధన మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం: తాడువాయి గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవ సమాధి (వైశాఖ శుద్ధ దశమి) ఆరాధన మహోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి సమసమాజ స్థాపన కోసం 332 సంవత్సరాలు దీక్ష చేశారని, జీవ సమాధి రోజున ఏటా ఆరాధన, గురుపూజలు చేస్తున్నట్టు చెప్పారు. సాయంత్రం తాడువాయి వీధుల్లో వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొక్కండ బ్రహ్మం, రాంబాబు, శ్రీనివాసచారి – మొగిలిచెర్ల సత్తిబాబు, ప్రసాద్ దాగం మల్లయ్య, వేణు, రాయలవరపు విజయకుమార్, శ్రీనివాస్, శ్రీపాద నరేష్, కోరుకొండ నానాజీ, ఓడూరి రమేష్ పాల్గొన్నారు.

సాయం పెంపు

జంగారెడ్డిగూడెం: దీపక్ నెక్స్‌జన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పేద కళాకారులకు అందిస్తున్న రూ.7 వేల సహాయాన్ని ఈ నెల నుంచి రూ.10 వేలకు పెంచుతున్నట్టు అభినయ నృత్యభారతి, నర్రా సుబ్బయ్య ఫౌండేషన్, మానవత కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల నుంచి మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు తన మాతృమూర్తి కమలావతి జ్ఞాపకార్థం రూ.3 వేలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

సర్వీసు రూటు మార్పు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళ్లేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం రూటు మార్పు చేసినట్టు ఆర్టీసీ స్థానిక డిపో మేనేజర్ తెలిపారు. ఈ నెల 8 నుంచి ఉదయం 6 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళ్లే అల్ట్రా డీలక్స్ సర్వీసు ఏలూరు బైపాస్ మీదుగా నడపనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాతకు పూజలు



కొయ్యలగూడెం : వాసవీ మాతకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెం : వాసవీ కన్యకాపరమేశ్వరి



పోలవరం రూరల్ : కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ద్వారకాతిరుమల : వాసవీమాత అమ్మవారు

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి జయంతి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొనకళ్ల కిషోర్ దంపతులు పూజలు చేశారు. 108 కన్యలతో 108 కలశములతో మహిళలు, భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకం, మంగళ నీరాజనాలు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టణానికి చెందిన రాచూరి బాల ఈశ్వరయ్య కుమారుడు ప్రకాశరావు అరకేజీ వెండిని బహూకరించారు. పట్టణానికి చెందిన ఉప్పలమెట్ట కపుల్స్ క్లబ్ వారు అమ్మవారికి పసుపు కుంకుమ, సారె సమర్పించారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వాసవీ మాత ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, గ్రామోత్సవం, మండపారాధన, మహిళలచే కుంకుమార్చన, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించుకున్నారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గవరవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సారే, రవికలు పంపిణీ చేశారు. చొప్ప రామన్నగూడెం, కన్నాపురం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

వాసవీ జయంతి

పోలవరం రూరల్: అఖండ గోదావరి నదీ తీరాన గల పోలవరంలోని శ్రీ వాసవీ కన్యాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా కుంకుమార్చన, పుష్పాలతో పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకం, లలితా సహస్ర పారాయణలు చేపట్టారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఘనంగా వాసవీమాత జయంతి

ద్వారకాతిరుమల: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో వాసవీమాత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో కొలువైన అమ్మవారికి పురోహితులు పూజలు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ బొండాడ రాంపండు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రుత్వికులు వేద మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించిన హోమ క్రతువులో పలువురు ఆర్యవైశ్య సంఘ నేతలు పాల్గొన్నారు.

యుద్ధ సమయంలో జాగ్రత్తలపై మాక్ డ్రిల్



జంగారెడ్డిగూడెంలో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జంగారెడ్డిగూడెం: యుద్ధ మేఘాలు ఆవరించినప్పుడు ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండేందుకు ప్రయత్నించాలని తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎస్సై షేక్ జబీర్‌లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ప్రమాదాలకు గురైతే ఎలా రక్షించాలి, ఏ విధంగా సురక్షితంగా ఉండాలో చేసి చూపించారు. ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, విద్యుత్ డీఈ యు.సుబ్బారావు, ఫైర్ అధికారి జి.అబ్రహాం, కానిస్టేబుల్ ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: గ్రామాల్లో మాక్ డ్రిల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం సరళ కుమారి తెలిపారు. పహల్గాం దాడితో భారత్ – పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో యుద్ధం వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల అధికారుల సన్నాహక సమావేశం తహసీల్దార్ ఎలీషా అధ్యక్షతన నిర్వహించారు. ఎలీషా, ఎంపీడీఓ సరళకుమారి, ఎస్సై చెన్నారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రసన్న కుమార్, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వధూవరులుగా రమా సత్యదేవులు

కొయ్యలగూడెం: శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి మూడు రోజుల కల్యాణ మహోత్సవాలు గవరవరం (వెంకయ్య పాలెం)లో బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్ని వధూవరులుగా అలంకరించి ప్రధాన అర్చకులు వాడపల్లి ప్రభాకర రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. 8వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 93 సంవత్సరాల ప్రాశస్త్యం గల ఆలయ విశేషాలను భక్తులకు అర్చకులు వివరించారు.

అయ్యప్పస్వామికి పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో వరసిద్ధి వినాయక, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం జెడ్పీ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు యూత్ గోరుముచ్చు నాంచారయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, మెదడు, కంటి, దంతాలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు అల్లూరి రత్నాజీరావు, భౌమరాజు సత్యనారాయణరాజు, జి.వెంకటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు యూత్ నాయకులు పి.మంగరాజు, జి. పవన్ కళ్యాణ్, ట్రస్ట్ మెంబర్ జి.నీలిమ, తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని మెడికల్ క్యాంప్ ప్రాంగణం వద్దే సీపీఎం నాయకులు ఎ.రవి, తెల్లం రామకృష్ణ, తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

పోలవరం రూరల్: అఖండ గౌతమి నదీ తీరాన పోలవరం గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీ దత్త వెంకటేశ్వరస్వామి పంచాహ్నిక దివ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం 6.54 గంటలకు వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. బుధవారం గోపూజ, మండపారాధన, ఆహావిత హోమాలు పుష్పాదివాసం, పవళింపు సేవ తదితర పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను వాయిద్యాలు, కోలాటం నడుమ గ్రామంలో ఊరేగించారు.

మాజీ మంత్రి వనితపై దుష్ప్రచారం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితపై దుష్ప్రచారం తగదని ఆ పార్టీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. ఓ మీడియా చానల్‌లో వనితపై మంగళవారం వచ్చిన కథనాన్ని పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో వాసు విలేకరులతో మాట్లాడుతూ వనిత నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని వివరించారు. తమ పార్టీలో గ్రూపులు లేవని చెప్పారు. వనిత ప్రతిష్టను దెబ్బతీసేందుకే కొందరు వ్యక్తులు బురద చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ చిన్న కష్టం వచ్చినా వెంటనే ఆమె స్పందిస్తున్నారని అన్నారు. కాపు సంఘ నేత పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, గుండుగొలనుకుంట సొసైటీ మాజీ చైర్‌పర్సన్ గోపా నాగేశ్వరరావు, పార్టీ తూర్పు గోదావరి జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు గుర్రాల లక్ష్మణ్‌లు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి వనిత పెద్దపీట వేశారని గుర్తు చేశారు. సామాజిక న్యాయంలో భాగంగా కాపులకు సైతం ఆమె ఉన్నత పదవులు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ పోతేపల్లి సర్పంచ్ పోల్కంపల్లి అనీల్, పార్టీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ చిలుకూరి చంద్రం, రుద్ర శివ, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, కోడిగూడెం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెలికాని బుల్లియ్య, పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, మండల సచివాలయాల మాజీ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులున్నారు.

20న మున్సిపల్ కార్మికుల సమ్మె

జంగారెడ్డిగూడెం: మే 20న నిర్వహించే ఉద్యోగ, కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి బొక్కా శ్రీనివాసరావు, అయినాల ముత్యాలరావు, దోసూరి నాగరాజు, కొత్తూరి శ్రీను, అప్పలస్వామి, ఎల్లంకి ప్రసాద్, ముప్పిడి సురేష్, నూకరాజు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు డి.పోసిబాబు, ఒ.నాగరాజు, కె.శ్రీనివాస్, ఎస్ సాయికుమార్‌లు రక్తదానం చేసినట్టు ల్యాబ్ టెక్నీషియన్ బొల్లాపు శారా తెలిపారు. ఈ రక్తాన్ని బ్లెడ్ స్టోరేజ్‌లో భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రమ్య, డాక్టర్ జనార్థన్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం శ్రీను, స్టాఫ్ నర్స్ ముక్కమ్మ, హెల్పర్ ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్మీకి శుభాకాంక్షలు

జంగారెడ్డిగూడెం: పహల్గామ్ ఉగ్ర దాడుల నేపథ్యంలో భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి చేయడంపై బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్ అధ్యక్షతన భారత ఆర్మీకి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఉపాధ్యక్షురాలు పీవీ రామలక్ష్మి, సీనియర్ నాయకులు కొప్పాక శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్‌లు మాట్లాడారు. తొలుత అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు.

స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఏలూరుకు చెందిన భక్తుడు కొలహలం భరత్ వర్మ బుధవారం రూ.1,08,000 విరాళంగా అందజేశారు. తొలుత భరత్ సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కొయ్యలగూడెం: శిశువులకు టీకాల ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి సంపూర్ణ రక్షణ లభిస్తుందని బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజవరంలో బుధవారం ఇమ్యూనైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు టీకాల ఆవశ్యకతను వివరించారు. ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.